క్లుప్తంగా

అధ్యాపకురాలికి బెస్ట్ ఉమన్ సైంటిస్ట్ అవార్డు



అవార్డును అందుకుంటున్న డాక్టర్ సుశీల

కావలి: కావలిలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పీజీ కళాశాల జంతుశాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ మీసాల సుశీల నావల్ రీసెర్చ్ అకాడమీ అందించే అవార్డు బెస్ట్ ఉమన్ సైంటిస్ట్ 2023–24కు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస రావు ఈ అవార్డును డాక్టర్ సుశీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ వి శైలజా, డాక్టర్ గోపీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మాఘపూర్ణిమ శివరాత్రి విశిష్టతలపై ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రభోద సేవా సమితి సభ్యులు

ఆత్మకూరురూరల్: మాఘ మాసంలో వచ్చే మాఘపూర్ణిమ, శివరాత్రి పండగలు భక్తులకు ఎంతో విశిష్టమైనవని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రభోద సేవా సమితి అధ్యక్షుడు పెంచల నరసయ్య అన్నారు. మండలంలోని బట్టేపాడు, అప్పారావు పాళెం, కొట్టాలు, వీర్లగుడిపాడుల్లో సోమవారం తమ కమిటీ సభ్యులతో కలిసి మాఘ మాసంలో వచ్చే పండగల విశిష్టతలపై ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి

సోమశిల: అనంతసాగరంలోని బస్టాండ్ సెంటర్, పశువుల ఆస్పత్రి, వసతిగృహాలు, పలు అభివృద్ధి పనులకు ఈ నెల 14న ప్రారంభోత్సవాలు జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రీసర్వే డీటీ బాధ్యతల స్వీకరణ

అల్లూరు: మండల రీ సర్వే డీటీగా ఎ.గీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కావలి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ రీసర్వే డీటీగా పని చేసిన సైమన్‌బాబు బదిలీపై కావలి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ




ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు

కలిగిరి: ఎంపీడీఓగా ఎం.రంగసుబ్బరాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన జి.వెంకటేశ్వరరావు చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

మర్రిపాడు: మండలంలోని చాబోలు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓలు నజీర్, ధనలక్ష్మి, ఎంపీడీఓ మనోహర్‌రాజ్ సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. పాఠశాలలో అందుతున్న విద్యతో పాటు మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ పల్లెకుపోదాం



అవగాహన కల్పిస్తున్న బీజేపీ నేతలు

మర్రిపాడు: మండలంలోని నందవరం, డీసీపల్లి, చిన్నమాచనూరు గ్రామాల్లో సోమవారం బీజేపీ నేతలు పల్లెకుపోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి ప్రజలను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సద్దా రమేష్‌రెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి గడపకే సర్కారు పాలన

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటికే ప్రభుత్వ పాలన తెచ్చింది. పింఛన్ కావాలన్నా.. రేషన్‌కార్డు కోరినా.. ఇంటి స్థలానికి, ఇంటి నిర్మాణానికి, ప్రభుత్వ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా లబ్ధిదారుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. తమకు ఈ అవసరం ఉందని వలంటీర్‌కు చెబితే.. అన్ని పనులు వారే ఇంటి వద్దకు వచ్చి పూర్తి చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వీరి స్థాయికి మించినది అయితే నేరుగా సచివాలయ సిబ్బందే వచ్చి పరిష్కరిస్తున్న పరిస్థితిని ఈ ప్రభుత్వం తెచ్చింది.



కావలి మండలం కొత్తపల్లిలోని గ్రామ సచివాలయం

- కావలి పట్టణంలో 28, పల్లెల్లో 16 సచివాలయాలు
- 35 శాఖలకు సంబంధించి 500 సేవలు
- నాలుగేళ్లలో 46,733 సమస్యలకు పరిష్కారం

కావలి: దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను తెచ్చింది. అవినీతికి, వివక్షకు కానీ తావులేని పరిపాలన ప్రజలకు అందించాలన్నా ప్రధాన ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. గ్రామ స్వరాజ్యం కోసం కలలు కన్న జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి రోజు 2019 అక్టోబర్ 2న దేశ చరిత్రలోనే సరికొత్త పాలనకు బీజం పడింది. పల్లె పరవశించింది. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసింది.

కావలి మండలంలో 16, పట్టణంలో 28 వార్డు సచివాలయాలు ఆవిష్కృతమయ్యాయి. గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 సేవలు అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఇక పనులు ఆలస్యమవుతాయని బాధ లేకుండా పోయింది. పేదవాడికి సంక్షేమం అందదనే బెంగ తీరింది. పింఛన్ కావాలన్నా.. రేషన్ కార్డు కావాలన్నా.. ఇంటి పట్టాలు కావాలన్నా.. తాగునీటి సరఫరా సమస్య ఉన్నా.. సివిల్ పనులకు సంబంధించిన పనులు ఉన్నా.. వైద్యం.. ఆరోగ్యం.. రెవెన్యూ.. భూముల సర్వే.. శిశు సంక్షేమం.. ఇలాంటివెన్నో గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే సమస్యను పరిష్కరిస్తున్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ తమకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందలేదని బాధపడే సమస్య లేకుండా లబ్ధిదారులకు ఏ సమస్య ఎదురైనా ఆ సమస్యను సచివాలయం నుంచి పరిష్కరించి పథకాన్ని అర్హత చూపించి, పథకాన్ని మంజూరు చేయించేందుకు వలంటీర్ నుంచి సచివాలయం సిబ్బంది మొత్తం చొరవ తీసుకుంటోంది. గ్రామ, వార్డు సచివాలయాలు వచ్చిన తర్వాత స్థానిక పాలనలో వేగం, పారదర్శకత, కచ్చితత్వం పెరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి తలుపులు తట్టి మరీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం ఒక ఆంధ్రప్రదేశ్‌లోనే తప్ప మరెక్కడా లేదు.

వలంటీర్లే ప్రజల సేవకుల్లా..

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులు గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా కుల, మత, వర్గ, వర్ణ, లింగ, రాజకీయ వివక్ష లేకుండా ప్రజల ఇంటి ముంగిటే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్న లక్ష్యంతో సేవలు అందిస్తున్న సేవా సైన్యం. ఎండైనా.. చలైనా, వానైనా వరదైనా, చివరికి కరోనా వంటి మహమ్మారి కబళించినా వెనుదిరగక, వెన్ను చూపక ప్రజాసేవే పరమావధిగా వలంటీర్లు సేవలందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రధాన భూమికగా వ్యవహరిస్తున్నారు. ఇంటింటికి వచ్చి, సంక్షేమ పథకాల గురించి వివరించి, లబ్ధిదారులతో దగ్గరుండి దరఖాస్తు చేయించి, సంక్షేమ ఫలాలు అందిస్తున్న వలంటీర్లు, వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు సేవలను ఎన్నటికీ మర్చిపోలేని విధంగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్రను వేశారు. ప్రజా సంక్షేమం కోసం ప్రతిక్షణం తపిస్తూ, ప్రభుత్వ పథకాలను నిర్విరామంగా అందిస్తూ, అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి సంధానకర్తలుగా వ్యవహరిస్తున్న సంక్షేమ సేవా జ్యోతులుగా గ్రామ, వార్డు సచివాలయాలు నిరుమాన సేవలు అందిస్తున్నాయి.

నాలుగేళ్లలో పరిష్కరించిన సమస్యలు

సచివాలయ వ్యవస్థకు 2019 అక్టోబరు 2వ తేదీన శ్రీకారం జరిగినా.. పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు మరి కొద్ది రోజులు పట్టింది. అప్పటి నుంచి కావలి పట్టణంలోని 28 వార్డు సచివాలయాల్లో ప్రజలు నుంచి 50,209 అర్జీలు ఉద్యోగులు అందుకున్నారు. వాటిలో 46,733 అర్జీలను పరిష్కరించారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో అత్యధిక సంఖ్యలో రెవెన్యూ శాఖకు సంబంధించి 25,941 అర్జీలు రాగా, వాటిలో 24,439 పరిష్కారమయ్యాయి. కావలి మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగులకు ప్రజలు నుంచి 27,297 అర్జీలు రాగా, వాటిలో 25,235 అర్జీలు పరిష్కారమయ్యా. వీటిలో కూడా అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించినవి 16,181 అర్జీలు రాగా, 15,028 పరిష్కరించారు.

కల్వర్టులో దిగబడిన లారీ



కల్వర్టులో దిగబడిన లారీ

చేజర్ల: జామాయిల్ కర్ర లోడ్‌తో వెళుతున్న ఓ లారీ కల్వర్టులో దిగబడిన ఘటన మండలం చేజర్ల కండ్రికలో సోమవారం జరిగింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్కూల్ పిల్లల బస్సు ఊర్లోకి రాలేకపోవడంతో నడిచివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధిక లోడు లారీలు తిరగడం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

నేడు విజయీభవ యాత్ర

మర్రిపాడు: మర్రిపాడులో మంగళవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్రను నిర్వహిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని పార్టీ మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, మిల్క్ సెంటర్ భవనాల ప్రారంభోత్సవాలను ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చేపడుతారన్నారు.

జగన్ పాలనే రాష్ట్రానికి శ్రీరామరక్ష



ప్రజలకు అభివాదం చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



ప్రచార రథంపై పర్యటిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటా
- సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి
- ఉదయగిరి విజయ సంకల్ప ప్రచార యాత్ర ప్రారంభం

జలదంకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రాష్ట్రానికి శ్రీరామరక్ష అని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గడిచిన ఐదేళ్లుగా ప్రజలు అన్ని విధాలా సుభిక్షంగా ఉన్నారన్నారు. ప్రతి వ్యక్తి జీవితానికి భరోసాగా ఈ ప్రభుత్వం నిలుస్తోందన్నారు. ఉదయగిరి నియోజకవర్గ విజయ సంకల్ప ప్రచార యాత్రను మండలంలోని జమ్మలపాళెం నుంచి సోమవారం ప్రారంభించారు. తొలుత వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ బుర్రి శ్రీవేణి ఆధ్వర్యంలో ప్రజలు రాజగోపాల్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. దారి పొడవునా పూల వర్షం కురిపిస్తూ నీరాజనాలు పలికారు. మహిళలు బొట్టు పెట్టి హారతులిచ్చారు. ముందుగా గ్రామంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక మహాలక్ష్మి ఆలయం, పోలేరమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రచార రథంపై రాజగోపాల్‌రెడ్డి గ్రామంలో పర్యటించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవకుడిగా ఉంటూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అవినీతికి తావు లేకుండా అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేశామని, ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు మహిళలకు అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, రైతులకు రైతు భరోసా, విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు అందించడంతో పాటు ప్రతి పల్లెకు మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. టీడీపీ, జనసేన పార్టీలకు గ్యారెంటీ లేకపోతే.. పథకాల గ్యారెంటీలు ఇస్తామని చెబుతూ మోసానికి తెరతీస్తున్నారన్నారు. వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని, అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీని ఆదరించాలన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో చేయని అభివృద్ధిని ఇప్పుడు చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై ప్రజలకు నమ్మకం ఉందని, వైఎస్సార్‌సీపీ రెండో సారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఉదయగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి తాను శాయశక్తులా కృషి చేస్తానని, నిరాడంబరంగా ఉంటే తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని, వారి కుటుంబాలకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనుంజయరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రావి ప్రసాద్‌నాయుడు, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, గుర్రం ధనుష్‌నాయుడు, తమ్మినేని సతీష్ నాయుడు, కోర్నిపాటి రామిరెడ్డి, సురె వెంకటశేషారెడ్డి, బోడిమండ్ల కృష్ణారెడ్డి, వర్ధినేని మురళీ, గుమ్మడి రమేష్, చేజర్ల హరిబాబురెడ్డి, పులి మాల్యాద్రి, పులిం బాబుల్‌రెడ్డి, చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం



మాట్లాడుతున్న కళాశాల డీన్ గోపీకృష్ణ

ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు ఆ కళాశాల అసోసియేట్ డీన్ టి గోపీకృష్ణ తెలిపారు. కళాశాలలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో చదివే విద్యార్థినులు కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురయ్యారని సమాచారం ఇటీవల ప్రచారంలోకి వచ్చిందన్నారు. ఇందులో వాస్తవం లేదన్నారు. కొంత మంది విద్యార్థినులు సాధారణ అనారోగ్యం కారణంగా అస్వస్థతకు గురై స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందారన్నారు. ఒకరిద్దరు విద్యార్థినులు బయట ఆహారం తినడం వల్ల ఈ సమస్య తలెత్తిందన్నారు. ఈ కళాశాల వసతిగృహం మేకపాటి కుటుంబీకుల ఆధ్వర్యంలో నడుస్తోందన్న ప్రచారం అవాస్తవమన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వానికి చెందిందేనన్నారు. ఆహారం, తాగునీరు విషయంలో పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ ఎస్.హేమలత, వార్డెన్ ఏ బాలచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల గ్రామోత్సవాలు



గంగమ్మ గ్రామోత్సవం



మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం

అల్లూరు: పట్టణంలోని గంగమ్మ, మహాలక్ష్మమ్మ వార్షిక మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మ వార్లకు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అర్ధరాత్రి తర్వాత అమ్మ వార్లను ప్రత్యేక వాహనాల్లో, విశేష పూలంకరణతో, మంగళవాయిద్యాలతో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

ప్రతిభ చూపిన ఇంజినీరింగ్ విద్యార్థులు



సింపోజియంలో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఆత్మకూరు: ఇటీవల చెన్నైలోని వేళమ్మాళ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయిలో టెక్నికల్ సింపోజియంలో ఆత్మకూరుకు చెందిన ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి మూడో స్థానంలో నిలిచారు. సోమవారం ఆ విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కిషోర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై వేళమ్మాళ్ ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నికల్ సింపోజియం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాలకు చెందిన ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఆత్మకూరు ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినులు మమత, ప్రసాదిని, అరవింద ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌లో మూడో స్థాయి బహుమతిని సాధించారన్నారు. ప్రొఫెసర్ పి జులైస్ నేతృత్వంలో వీరు ఈ ఎగ్జిబిషన్‌కు శిక్షణ పొందారని ప్రిన్సిపల్ వివరించారు. ప్రొఫెసర్‌తో పాటు విద్యార్థులను సత్కరించారు.

వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది పుస్తకాలే



మాట్లాడుతున్న హెచ్‌ఎం అనంతలక్ష్మి

ఆత్మకూరు: విజ్ఞానదాయక పుస్తకాలు ప్రతి ఒక్కరు తప్పని సరిగా చదవాలని పుస్తక పఠనంతో వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడం సులభమని ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనంతలక్ష్మి అన్నారు. పాఠశాల గ్రంథాలయానికి దివంగత ఆమంచర్ల నటరాజన్ తరఫున ఆయన కుమార్తె సరళాదేవి 300 పుస్తకాలు బహూకరించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మంచి పుస్తకాలను నటరాజన్ కుటుంబ సభ్యులు బహుకరించారని, అవి వారికి ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నటరాజన్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మల్లికార్జున, ఉపాధ్యాయులు మధుసూదన్ శాస్త్రి, డాక్టర్ ఎం ప్రసాద్, బీసీ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంపై అవగాహన



ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అల్లూరు: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లకు ఓటు వేసే విధానంపై ఈవీఎంలపై అధికారులు సోమవారం అవగాహన కల్పించారు. ఏఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఓటు వేసే వారికి అవగాహన కల్పించేందుకు వీలుగా ఈవీఎంల్లో ఏ విధంగా ఓటును వేయాలో తెలియజేస్తున్న తెలిపారు. బీఎల్‌ఓల ద్వారా ప్రజలకు ఈవీఎంల ద్వారా అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వీరేంద్ర, కార్యలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతల చేరిక



మాజీ సర్పంచ్‌లు కమతం బలరాం, పొనగంటి మాల్యాద్రి నాయుడులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



సురే జయశ్రీ, శ్రీనివాసులరెడ్డి దంపతులు



ఐటీడీపీ కావలి ఇన్‌చార్జి జగదీష్, మంజులదంపతులు

కావలి: కావలి మండలం, పట్టణంలోని టీడీపీ నాయకులు సోమవారం రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ బీద మస్తాన్‌రావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సిరిపురం మాజీ సర్పంచ్ కమతం బలరాం, కొత్తపల్లి మాజీ సర్పంచ్ పొనగంటి మాల్యాద్రి నాయుడు, అన్నగారిపాళెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు మక్కి భాస్కర్, గౌరవరం మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సురే జయశ్రీ, శ్రీనివాసులరెడ్డి దంపతులు, కావలి పట్టణం 11వ వార్డుకు చెందిన టీడీపీ నేత, ఐటీడీపీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మైనంపాటి జగదీష్, మంజుల వాణి దంపతులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ల శ్రీనివాసకిరణ్, మాజీ కావలి రూరల్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, కావలి మండల సచివాలయాల కన్వీనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అన్నగారిపాళెం మాజీ ఎంపీటీసీ మక్కి భాస్కర్

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లి ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించి కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పక్కా ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి



ఉదయగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న లేఅవుట్లలోని ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఉదయగిరి హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ ఈవీ ప్రసాద్ అన్నారు. స్థానిక డీఈ కార్యాలయంలో సోమవారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో పక్కా ఇళ్ల నిర్మాణం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవసరమైన సామగ్రి అందజేసి త్వరగా పూర్తి చేసేలా అవగాహన కల్పించాలన్నారు.